# ఒత్తిడి లేకుండా..పరీక్షలు రాయాలి

**విద్యార్థులకు సూచించిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ • పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా • పలు కేంద్రాల్లో విద్యార్థులు డుమ్మా**

శంషాబాద్ రూరల్/హిమాయత్‌నగర్/జూబ్లీహిల్స్, మార్చి 18: ఎలాంటి ఒత్తిడి లేకుండా పదో తరగతి పరీక్షలు రాయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ విద్యార్థులకు సూచించారు. సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ శంషాబాద్ పట్టణంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక్ మాట్లాడుతూ ఎలాంటి ఒత్తిడి లేకుండా పదో తరగతి పరీక్షలు రాయాలన్నారు. పదో తరగతి పరీక్ష కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసిన ఉపాధ్యాయులను అభినంధించారు. మాస్ కాపింగ్‌కు అవకాశం లేకుండా ప్రత్యేక నిఘా ఏర్పాట్లు ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. శంషాబాద్ పట్టణంలోని బాలుర ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన వారిలో శంషాబాద్ తహసీల్దార్ నాగమణి, ఆర్ఐ సంజీవ,విద్యాశాఖ అధికారులు, పోలీస్ అధికారులు ఉన్నారు.

• శంషాబాద్ మండలంలోని 8 పరీక్షా కేంద్రాలలో 1836 మంది విద్యార్థులకు పరీక్ష రాయడానికి ఏర్పాట్లు చేశారు. మొదటి రోజు 1825 మంది విద్యార్థులు హాజరుకాగా, 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

**• ప్రశాంతంగా పది పరీక్షలు**

పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. యూసుఫ్‌గూడ, శ్రీరాంనగర్, జవహర్‌నగర్, బోరబండ ప్రభుత్వ పాఠశాలలతో పాటు ఖైరతాబాద్ జోన్ పరిధిలోని 38 సెంటర్లలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆయా కేంద్రాలలో 8 వేలమందికి పైగా విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశామని ఖైరతాబాద్ జోన్ డిప్యూటీ డీఈఓ సామ్యూల్ రాజ్ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.



శంషాబాద్ పట్టణంలో బాలుర పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్, తదితరులు



యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాల వద్ద ..

**• మొదటి రోజు ప్రశాంతం**

హిమాయత్‌నగర్‌జోన్ పరిధిలోని వివిధ పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు మొదటి రోజు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. పలు పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం 8.30 నుంచే సందడి కన్పించింది.ఈ ఏడాది జోన్ నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 4,943 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 4,925 మంది హాజరయ్యారు. 18 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేదని హిమాయత్‌నగర్ జోన్ డిప్యూటీ విద్యాశాఖాధికారి విజయలక్ష్మి తెలిపారు. పరీక్ష సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నారాయణగూడ పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

## వైభవంగా శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



రామంజాపూర్ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి దంపతులు

శంషాబాద్ రూరల్, మార్చి 18 : మండలంలోని రామంజాపూర్ గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ వేడుకలకు చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఆయన సతీమణి సంగీతారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... పూర్వకాలంలో ఆలయాలు అద్భుతంగా నిర్మాణం చేశారని తెలిపారు. ప్రజల కోరికలు తీర్చే శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ కోమల నర్సమ్మ,ప్రకాశ్‌లతో పాటు పలువురు గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పీఎస్‌లో..గేట్లు మూసివేసి ప్రణీత్‌రావు విచారణ

సిటీబ్యూరో, మార్చి 18 (నమస్తే తెలంగాణ): ఫోన్‌ట్యాపింగ్, కీలక సమాచారాన్ని ధ్వంసం చేశాడనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావును సోమవారం బంజారాహిల్స్ ఠాణాలో పోలీసులు విచారించారు. జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరితో పాటు మరో ముగ్గురు అధికారులు ప్రణీత్‌రావును విచారించారు. విచారణ సమయంలో ఠాణాలోకి ఎవరూ ప్రవేశించకుండా బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ గేట్లను పూర్తిగా మూసివేశారు. ఫోన్‌లు ట్యాపింగ్, సమాచారం ధ్వంసం కేసుకు సంబంధించి మరింత సమాచారాన్ని రాబట్టడంలో భాగంగా పంజాగుట్ట పోలీసులు న్యాయస్థానం అనుమతితో ఆదివారం ప్రణీత్‌రావును 7 రోజుల పోలీస్ కస్టడీకి తీసుకున్న విషయం తెలిసిందే.



ఓటు విలువపై అవగాహన కల్పిస్తున్న డా. ప్రశాంత్ తదితరులు

## ఓటు ఎంతో విలువైనది

– డీన్ ప్రశాంత్

వ్యవసాయ యూనివర్సిటీ , మార్చి 18: ఓటు ఎంతో విలువైనదని, కొండాలక్ష్మణ్ తెలంగాణ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్, ప్రశాంత్ అన్నారు. సోమవారం కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఇంటెన్సి ఓటర్ అవేర్‌నెస్ అండ్ రిజిస్ట్రేషన్ డ్రైవ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యదేశం మనదని , ఓటు అనే ఆయుధంతో మనకు సరైన వ్యక్తిని పాలకుడిగా ఎన్నుకునే అవకావం ఉందన్నారు.ప్రధానంగా ఉన్నత విద్యను అభ్యశించే మనం మరింత బాధ్యతగా ఓటు వేయాలన్నారు. చాలా మంది విద్యార్థులకు ఈ సారే కొత్తగా ఓటు వేసే అవకాశం ఉందన్నారు. అనంతరం ప్రోగ్రామ్ ఆఫీసర్ సంతోషిని లావణ్య , విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.అంతకు ముందు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డా. నాగహర్షిత , అశ్విని కుమార్, శ్రీనివాసులు, శ్రీరాములు తదితరులు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు.





సోమవారం పది పరీక్షలు ప్రారంభమైన సందర్భంగా యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాల వద్ద విద్యార్థులను తనిఖీలు చేసి పంపుతున్న ఉపాధ్యాయులు. –జూబ్లీహిల్స్

## బజారున కార్మికుల బతుకులు

శంషాబాద్ రూరల్, మార్చి 18 : కాలుష్య నియంత్రణ శాఖ అధికారుల నిర్వాకంతో వందల మంది కార్మికులు రోడ్డున పడ్డారు. ఈ ఘటన సోమవారం గగన్‌పహడ్ పారిశ్రామిక వాడలో చోటు చేసుకుంది. కార్మికులు, కంపెనీ ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం.. దాదాపు 30 ఏండ్ల క్రితమే ఇక్కడ కంపెనీలు ఏర్పాటు చేసి ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. కానీ ఇటీవల కాలుష్య నియంత్రణశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా కంపెనీలను తొలగించాలని ఆదేశించారు. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు సోమవారం కంపెనీలకు విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. ఫలితంగా వందలాదిమంది కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ విషయమై కోర్టు సీరియస్ అయ్యింది. తప్పుడు ఆదేశాలు జారీ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని తెలిపిందని పరిశ్రమల నిర్వాహకులు శుభం, అజేయ్, యోగేష్ తెలిపారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి తమ కంపెనీలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని కోరారు. దీనిపై విద్యుత్‌శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ తాజ్‌దీన్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరా నిలిపివేసిన్నట్లు తెలిపారు.



కంపెనీకి విద్యుత్ బంద్ కావడంతో కంపెనీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

## 45 మంది విద్యార్థులు డుమ్మా

బండ్లగూడ, మార్చి 18: రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నియోజకవర్గం పరిధిలోని గండిపేట మండలంలో పదకొండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా రాజేంద్రనగర్ మండలం పరిధిలో 19 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి పదవ తరగతి పరీక్షలు నిర్వహించారు. పరీక్షా సమయానికి విద్యార్థులు గంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. గండిపేట మండలంలోని 11 పరీక్షా కేంద్రాలలో 2,562 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 16 మంది గైర్హాజరు కావడంతో 2546 మంది పరీక్షలు రాసినట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు. అదే విధంగా రాజేంద్రనగర్ మండలం పరిధిలో మొత్తం 4714 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, 29 మంది గైర్హాజరయ్యారు. 4685 మంది పరీక్షలకు హాజరైనట్లు అధికారులు పేర్కొన్నారు.




## ఔటర్ రింగ్‌రోడ్డుపై రోడ్డు ప్రమాదం

శంషాబాద్ రూరల్, మార్చి 18: ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదం జరిగిన ఘటన శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం బీరంగూడ గ్రామానికి చెందిన ఎస్ వెంకన్న తన టీఎస్ 15ఈఎక్స్ 8762 నంబర్‌గల కారులో సోమవారం ఉదయం సూర్యాపేట నుంచి స్వగ్రామానికి వస్తుండగా శంషాబాద్ మండలంలోని పెద్ద గోల్కొండ సమీపంలో .. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న ఏపీ 39 కేకే 2033 నంబర్ గల కారు వెనుక నుంచి వచ్చి ఢీకొనడంతో కారు వెనుక, ముందు భాగాలలో దెబ్బతిన్నట్లు తెలిపారు. కారు నడిపిన డ్రైవర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఒంగోలుకు చెందిన సందీప్‌గా గుర్తించారు. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు సందీప్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ఔటర్‌రింగ్ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో దెబ్బతిన్న కారు



## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కంప్యూటర్ అక్షరాస్యత

జూబ్లీహిల్స్ నియోజకవర్గం షేక్‌పేట్ డివిజన్ రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో యువత సాధికారిత కోసం బస్తీ కంప్యూటర్ అక్షరాస్యత కార్యక్రమం ప్రారంభించారు.రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్,మిడ్ టౌన్ (ఆర్ఐ 3150)ల సంయుక్తంగా విశ్వ ఫౌండేషన్‌కు 20ల్యాప్ ట్యాప్‌లను అందజేశారు.ఈ కార్యక్రమంలో సీఈఓ ప్రభాకర్ రామకృష్ణన్,రోటెరియన్స్ థాన్సెన్,సీమా కుమార్, హైదరాబాద్ ప్రెసిడెంట్ రాయ్ జోసెఫ్,మిడ్‌టౌన్ ప్రెసిడెంట్ నిధి ఆనంద్,హదిరా,సేవాభారతి కోఆర్డినేటర్ మీనా,ప్రైమ్ సాఫ్ట్ సభ్యులు దీప్త,అక్షయ,సూరజ్,కార్తీక్ ,విశ్వ ఫౌండేషన్‌శ్యామ్,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

–షేక్‌పేట్ మార్చి 18

## మాదిగలకే టికెట్ కేటాయించాలి

కంటోన్మెంట్, మార్చి 18: కంటోన్మెంట్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో అన్ని ప్రధాన పార్టీలు మాదిగ సామాజిక వర్గానికే టికెట్ కేటాయించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు అన్నారు. కంటోన్మెంట్ పరిధిలోని మూడో వార్డులో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న కంటోన్మెంట్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో అన్ని ప్రధాన పార్టీలు మాదిగ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకే టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. గత 50 ఏండ్లలో ఏ ప్రధాన పార్టీ కూడా మాదిగ సామాజిక వర్గానికి టికెట్ కేటాయించలేదని మండిపడ్డారు. ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గమైన కంటోన్మెంట్‌లో అత్యధికంగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారే ఉన్నారని తెలిపారు.

ఈ ఎన్నికల్లోనైనా మాదిగలకు టికెట్ కేటాయిస్తే మాదిగల ఐక్యతను చాటుతామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఇటుక శ్రీకిషన్ మాదిగ, అజిత్ కల్యాణ్, ఇటుక గోపి మాదిగ, రొట్టెల సునీల్ కుమార్ మాదిగ, శ్రీకాంత్ మాదిగ, శివ, మురళి మాదిగ తదతరులు పాల్గొన్నారు.

## బైక్ చోరీ

వెంగళరావునగర్, మార్చి 18: సర్వీసింగ్ సెంటర్ ఎదుట ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటన ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జి.జానకి రాములు తెలిపిన వివరాల ప్రకారం.. బల్కంపేట రోడ్డులోని విశాల్ ఆటో మొబైల్స్ సర్వీస్ సెంటర్‌కు ఓ మహిళ తన టీవీఎస్ జూపిటర్ వాహనాన్ని సర్వీస్ కోసం ఇచ్చి వెళ్లింది. వాహనం సర్వీస్ చేసిన అనంతరం కస్టమర్‌కు ఇచ్చేందుకు సర్వీస్ సెంటర్ ముందు ఉంచారు. సోమవారం మధ్యాహ్నం ఓ వ్యక్తి మాస్క్ ధరించి ఆటోమొబైల్స్ దుకాణంలోకి వచ్చి స్పేర్ పార్ట్స్ కావాలని అడిగాడు. అనంతరం అక్కడ నుంచి వెళ్తూ సర్వీస్ సెంటర్ ముందు ఉంచిన ద్విచక్ర వాహనాన్ని తీసుకొని ఉడాయించాడు. దీంతో విశాల్ సర్వీస్ సెంటర్ నిర్వాహకుడు ఇ.ఎ.ఫెర్నాండేజ్ ఎస్ఆర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు డీఐ తెలిపారు.

## మహిళా ఉద్యోగులకు సత్కారం

ఉస్మానియా యూనివర్శిటీ, మార్చి 18: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉస్మానియా యూనివర్సిటీ గెస్ట్ హౌస్‌లో పని చేస్తున్న మహిళా ఉద్యోగులను డైరెక్టర్ ప్రొఫెసర్ జహంగీర్ శాలువాతో ఘనంగా సత్కరించారు. మహిళలను గౌరవించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన తెలిపారు.

## సివిల్ సర్వీసెస్ విద్యార్థులకు అవగాహన

ముషీరాబాద్, మార్చి 18: విద్యానగర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం సివిల్ సర్వీసెస్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ కృష్ణప్రదీప్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే అత్యున్నత ఉద్యోగాలైన సివిల్ సర్వీసెస్ సాధించవచ్చునని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుకన్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌కు నివాళి

కవాడిగూడ, మార్చి 18: బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు వెళ్లే ముందు సోమవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నివాళులర్పించారు.

# పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

**సీడీపీవో రేణుక**

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 18: పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో రేణుక వెల్లడించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని బాబుల్‌రెడ్డినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషన్ పక్వాడా(పోషణ పక్షం) కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే సీమంతం, అన్నప్రసన్న కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీవో రేణుక హాజరై మాట్లాడుతూ తల్లులకు పోషణ విలువలు, అదనపు ఆహార విశిష్టత, తల్లి పాలన ఆవశ్యకత, రక్త హీనత తదితర అంశాలపై వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందే సేవలను పూర్తిస్థాయిలో లబ్ధిదారులు తెలుసుకొని వాటిని అందిపుచుకోవాలన్నారు. చిన్నారులు,కిశోర బాలికలు, బాలింతలను పోషకాహారలోపం నుంచి విముక్తులను చేయడం, ఆరోగ్యవంతులను చేయడానికి పోషణ పక్వాడా దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మజ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనిత, అంగన్‌వాడీ టీచర్లు అనిత, మాధవి, రత్నకుమారి, కనకవ్వ, ఏఎన్‌ఎం ప్రేమదేవి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.



బాబుల్‌రెడ్డినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణికి సీమంతం నిర్వహిస్తున్న సీడీపీవో రుణుక, చిత్రంలో సూపర్ వైజర్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు

# ఇన్‌ఫెక్షన్ నివారణ చర్యలపై ముగిసిన అవగాహన

బన్సీలాల్‌పేట్, మార్చి 18: దవాఖానలో రోగులు త్వరగా కోలుకోవడానికి ఇన్‌ఫెక్షన్ నివారణ చర్యలు ఎంతో దోహదపడతాయని కింగ్ కోఠి ప్రభుత్వ దవాఖాన, పెథాలజీ విభాగం డిప్యూటీ సివిల్ సర్జన్, ఏఓ డాక్టర్ మల్లికార్జున్ అన్నారు. బోయిగూడలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, సికింద్రాబాద్‌లో కంటిన్యూడ్ నర్సింగ్ ఎడ్యుకేషన్–4లో భాగంగా ఏడు రోజుల పాటు 'ఇన్‌ఫెక్షన్ నివారణ – నియంత్రణ చర్యలు' అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సు సోమవారం ముగిసింది. ఇందుకు మల్లికార్జున్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. నర్సింగ్ ఆఫీసర్ల విధి నిర్వహణలో ఎంతో ముఖ్యమైన ఈ అంశంపై అవగాహన శిబిరాన్ని ఏర్పాటు చేసిన నర్సింగ్ కళాశాల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ (నర్సింగ్) శాఖ, న్యూఢిల్లీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో నగరంలోని గాంధీ, ఉస్మానియా, నిలోఫర్, ఫీవర్, ఛాతి, క్యాన్సర్, జిల్లా, ఏరియా దవాఖానలకు చెందిన నర్సింగ్ ఆఫీసర్లు హాజరయ్యారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, సికింద్రాబాద్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.విద్యుల్లత మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో దవాఖానలో చేరిన రోగులకు ఎలాంటి ఇన్‌ఫెక్షన్ సోకకుండా జాగ్రతలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని, తద్వారా వారు సంపూర్ణ ఆరోగ్యంతో డిశ్చార్జి అవుతారన్నారు. విధి నిర్వహణలో వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్లు ఇన్‌ఫెక్షన్ బారిన పడకుండా జాగ్రతలను తీసుకోవాలని ఆమె సూచించారు.

ఈ శిబిరంలో ప్రొఫెసర్ రేణుకాదేవి, అధ్యాపకులు ఎం.విజయ కుమారి, పి.భాగ్యలక్ష్మి, పి.చరిత, ఎం.వనజ, వి.మధుర, ఎం.మంజుల పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ మల్లికార్జున్, ప్రిన్సిపాల్ డాక్టర్ విద్యుల్లత

## వంద శాతం ఆస్తి పన్ను వసూళ్లే లక్ష్యం

బేగంపేట, మార్చి 18: బేగంపేట సర్కిల్ పరిధిలో ఆస్తి పన్ను వందశాతం వసూళ్లే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య తెలిపారు. ఇప్పటికే ఎనభై శాతం వసూలు అయ్యాయని, మరో ఇరవై శాతం ఈ నెలాఖరు వరకు లక్ష్యం చేరుకుంటామన్నారు. ఆస్తి పన్ను బకాయిదారులకు ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న పాత బకాయిలపై 90 శాతం వడ్డీ మాఫీ ప్రకటించామని చెప్పారు. బకాయిదారులకు అర్థమయ్యేందుకు వివిధ ప్రాంతాల్లో అవగాహన కూడా కల్పిస్తున్నామన్నారు. ఆస్తి పన్ను సమస్యలను పరిష్కరించేందుకు జీహెచ్ఎంసీ నిర్దేశించిన వేదికలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో భాగంగా ఆదివారం నిర్వహించిన వేదికలో ఆస్తి పన్ను సమస్యలపై 17 దరఖాస్తులు వచ్చాయని, వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకుంటామని తెలిపారు. మరికొన్ని రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో ఆస్తి పన్ను బకాయిదారులకు జీహెచ్ఎంసీ ప్రత్యేక ఆఫర్‌ను కల్పించిన విషయం తెలిసిందే. మరో 80 శాతం రానున్న 12 రోజులలో పూర్తి స్థాయి లక్ష్యం కోసం ముందుకు సాగుతున్నామని తెలిపారు.

## 23న ఫాల్కనర్ వర్సిటీ స్పాట్ అడ్మిషన్లు

అమీర్‌పేట్, మార్చి 18: భారతీయ విద్యార్థులకు అధునాతన బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సులను అందుబాటులోకి తెస్తూ అలబామాలోని మాంట్‌గోమెరీకి చెందిన ఫాల్కనర్ విశ్వవిద్యాలయం ఈ నెల 23న బేగంపేట్‌లోని హోటల్ తాజ్ వివాంతాలో స్పాట్ అడ్మిషన్లు అందించనుంది. అమీర్‌పేట్‌లోని హోటల్ ఆదిత్య పార్క్‌లో సోమవారం జరిగిన సమావేశంలో విశ్వవిద్యాలయ అధ్యక్షులు మిచ్ హెన్రీ మాట్లాడారు. మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ మేనేజ్‌మెంట్ ఇన్ బిజినెస్ అనలిటిక్స్, మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ మేనేజ్‌మెంట్ ఇన్ ఐటీ వంటి ప్రధాన కోర్సులకు సంబంధించి ఈ నెల 23న స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయన్నారు. విద్యార్థులకు విశ్వవిద్యాలయ ఎంపిక, ట్యూషన్ ఫీజులు, వీసా ఇంటర్వ్యూలు వంటి అంశాల్లో సహకారాన్ని అందిస్తున్నదన్నారు.

## నిబద్ధత కలిగిన వారినే వీసీలుగా నియమించండి

ఉస్మానియా యూనివర్శిటీ, మార్చి 18: తెలంగాణ రాష్ట్రంలోని పలు యూనివర్సిటీల వీసీల పదవీకాలం వచ్చే మే నెలలో ముగియనుండటంతో రాష్ట్ర ప్రభుత్వం అన్ని యూనివర్సిటీలకు కొత్త వీసీల ఎంపిక జరగనుంది. ఇందులో భాగంగా సెర్చ్ కమిటీ వేసిన సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ పృధ్వీతేజ మాట్లాడారు. పైరవీకారులకు కాకుండా నీతి నిజాయితీతో పనిచేసే పాలన దక్షత కలిగిన వారినే వీసీలుగా నియమించాలని డిమాండ్ చేశారు. గతంలో లంచాలకు అలవాటు పడి ఏసీబీకి దొరికిపోయిన వీసీలను, రాజకీయ నాయకుల అడుగులకు మడుగులు ఒత్తే వీసీలకు చరమగీతం పాడాలని సూచించారు. యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడే వారిని నియమించాలని డిమాండ్ చేశాడు. అకడమిక్స్, అడ్మినిస్ట్రేషన్ పట్ల అవగాహన ఉన్న వ్యక్తులను వీసీలుగా నియమించాలని తెలిపారు. కొన్నేండ్లుగా నిధులు, నియామకాలు లేక యూనివర్శిటీ ఆగమైందని, ఇప్పటికైనా సమర్థులైన వారిని వీసీలుగా నియమిస్తే బాగుంటుందని ఆయన పేర్కొన్నారు.

## లష్కర్ జిల్లా ఏర్పాటుకు పోరాడుదాం

సికింద్రాబాద్, మార్చి 18: లష్కర్ ప్రత్యేక జిల్లా ఏర్పాటుకు సహాయ సహకారాలు అందించాలని లష్కర్ జిల్లా సాధన సమితి నాయకులు బీజేపీ నేత మోహన్‌రావును కలిసి వినతి పత్రం సమర్పించారు. మోహన్‌రావును సోమవారం కలిసిన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్ జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై మాట్లాడారు. జిల్లా సిద్ధించే వరకు కలిసి పోరాడుదాం. ఇందులో భాగంగా పవన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, జిల్లా ఆవశ్యకత ఎంతైనా అవసరమని ఆయనకు వివరించారు. బీజేపీ నేత మోహన్‌రావు తన వంతు సహాయ సహకారం అందించాలని కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సాధన సమితి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ నేత మోహన్‌రావును కలిసి వినతి పత్రం ఇస్తున్న జిల్లా సాధన సమితి నాయకులు